ఘనంగా తొలి ఏకాదశి



చీర్యాల గ్రామంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో..

పవిత్ర ఆషాఢమాసంలో వచ్చే హిందువుల తొలి పండుగైన తొలి ఏకాదశి సందర్భంగా గురువారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలను మామిడి తోరణాలు, అరటి బోదెలు, పూల తోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయంలోని దేవి, దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు.



శివారెడ్డిగూడలో సామూహిక సత్యనారాయణ వ్రతం



క్లుప్తంగా...

అభివృద్ధి పనులు షురూ..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో సుమారు రూ.3 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అంతర్గత మురికి కాలువ నిర్మాణ పనులతో పాటు 17వ వార్డులో పార్కు కంపౌండ్ వాల్ నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

2న ఉచిత వైద్యశిబిరం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో వచ్చేనెల 2న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని వెంకటాపూర్ నీలిమా ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నీలిమా అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో పేదలకు వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తామని, ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైతే ఆస్పత్రిలో వైద్యంపై రాయితీ ఇస్తామన్నారు.

ఘట్‌కేసర్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా లతారెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న లతారెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఘనాపూర్ గ్రామానికి చెందిన పైల్ల లతారెడ్డి ఎన్నియ్యారు. మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోల లక్ష్మీ ఆమెకు నియామక పత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, పదవి వచ్చేందుకు సహకరించిన నియోజకవర్గ కోఆర్డినేట్ హరివర్ధన్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఘనాపూర్ సర్పంచ్ గోపాల్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

మేడ్చల్: బీజేపీ చేపట్టిన మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా పట్టణంలోని 23వ వార్డులో 75, 76, 77 పోలింగ్ బూత్‌ల పరిధిలో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచారు. తొమ్మిదేళ్లలో బీజేపీ చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ప్రచారం చేసిన ప్రతి ఇంటికీ నాయకులు కమలం స్టిక్కర్‌ను అంటించారు. బీజేపీని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి, వంశీవిజయ్ వంజరి, అవినాష్‌చారి, శ్రీకాంత్, రాజు, సర్వేశ్వర్‌రెడ్డి, ఎన్.ఎస్.గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వేణుగోపాల్, బుచ్చిరెడ్డి, గోపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లో ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలకు మల్లారెడ్డి ట్రస్ట్ అండగా నిలిచింది. గ్రామానికి చెందిన కుమ్మరి బుచ్చమ్మ, గేటు చంద్రకళ కుటుంబ సభ్యులను గురువారం బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు గ్రామ శాఖ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకుడు సాయిలుముదిరాజ్ పరామర్శించారు. ట్రస్ట్ తరఫున బాధిత కుటుంబాలకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10 వేలు అందజేశారు. వార్డు సభ్యుడు బుచ్చిరెడ్డి, ట్రస్ట్ ప్రతినిధి వేణు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ట్రాఫిక్ సీఐ బదిలీ

మల్కాజిగిరి: మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.సుదీర్‌కృష్ణ బదిలీ అయ్యారు. రెండున్నర సంవత్సరాలుగా విధులు సమర్థవంతంగా నిర్వహించిన సుధీర్ కృష్ణ భువనగిరి టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీకాగా ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

అక్రమాలపై చర్యలు.. తూతూమంత్రం..

బడాబడా నిర్మాణాలు.. పర్మిషన్ లేకుండా అక్రమ అంతస్తులు.. అయినా అటువైపు ఎవరూ చూడరు. ఎవరికి ఎంత అని ముందే నిర్ణయించి అందిస్తే చాలు.. చకచకా పేకమేడల్లా నిర్మాణాలను పేర్చుకుంటూ వెళ్లొచ్చు. అడిగే వారు ఉండరు.. ఆపే వారూ ఉండరు. పేద, మధ్యతరగతి ప్రజలు నాలుగు ఇటుకలు పేర్చి ఇళ్లు కట్టుకుంటే మాత్రం చాలా పెద్ద తప్పు. జేసీబీ, పోలీసులు, అధికారులు అంతా వచ్చి నేలకూల్చి వెళ్తారు. నెత్తి నోరూ కొట్టుకుంటూ వేడుకున్నా వారి బాధ కనిపించదు. కానీ బడా నిర్మాణాలు కూల్చాలంటే మాత్రం ఓ ఇద్దరు, ముగ్గురు సిబ్బంది వెళ్లి నాలుగు ఇటుకలను పెకిలించి.. ఫొటోలకు ఫోజులిచ్చి వస్తే చాలు.. అక్రమం సక్రమం అయిపోతుంది. గుండ్లపోచంపల్లిలో ఇలాంటి అక్రమాలపై సామాన్య మధ్యతరగతి ప్రజలు పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్..



మైసమ్మగూడలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో అక్రమ నిర్మాణాలను వెలికితీస్తూ సాక్షి దినపత్రికలో అడ్డగోలుగా.. అంతస్తులు అనే శీర్షికతో గురువారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారుల్లో చలనం వచ్చింది. సాక్షి కథనంతో ఉలిక్కిపడ్డ అధికారులు అక్రమ నిర్మాణాల వద్దకు చేరుకుని అరకొరగా కూల్చారు. మున్సిపల్ కమిషనర్ రాములు ఆదేశాల మేరకు అధికారులు, మున్సిపల్ సిబ్బంది మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని పలు అక్రమ నిర్మాణాల వద్దకు చేరుకున్నారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపినట్లు వ్యవహరించిన అధికారులు నామమాత్రంగా కూల్చివేతలు చేసి మమ అనిపించారు. అనుమతులు లేని భవన నిర్మాణదారుల పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. తమకు ముడుపులు అప్పజెప్పిన వారిపై అక్రమ నిర్మాణాలకు మినహాయింపు కల్పించి సామాన్యుల నిర్మాణాలను కూల్చివేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కూల్చివేతలు సైతం ఫొటోలకు ఫోజులు ఇచ్చేట్లు చేపట్టి చేతులు దులుపుకున్నారని సామాన్యుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూల్చివేతల్లో డీఈ ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





వారికో న్యాయం.. వీరికో న్యాయం..

జవహర్‌నగర్ కార్పొరేషన్ అరుంధతినగర్‌లో ప్రభుత్వ భూముల్లో వేసుకున్న గుడిసెలను బుధవారం పెద్దఎత్తున పోలీసులు, అధికారులు వచ్చి జేసీబీలతో కుప్పకూల్చారు. మరి ఇక్కడ ఎందుకు తూతూమంత్రంగా కూల్చారని గుండ్లపోచంపల్లి వాసులు ప్రశ్నిస్తున్నారు. ధనికులకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయమా..? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా చెట్ల నరికివేత

- పలువురిపై కేసు నమోదు
- ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు

మేడ్చల్‌రూరల్: తప్పుడు పత్రాలతో అనుమతులు పొంది పచ్చని చెట్లను నరికి వేసిన పలువురిపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేసి జరిమానా విధించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేవీరెడ్డి నగర్ కాలనీలో నదీమ్‌పాషా, అజయ్‌దేవ్, బాలాజీ అనే వ్యక్తులు ఈ నెల 21, 24 తేదీల్లో రోడ్డు పక్కన ఉన్న హరితహారం చెట్లను తొలగించారు. విషయం తెలుసుకున్న అంతెం సంక్షేమ సంఘం సభ్యులు వారిని ప్రశ్నించగా తమకు అటవీ శాఖ అనుమతులు ఉన్నాయంటూ పత్రాలు చూపించారు. చెట్ల నరికివేతపై సంఘం సభ్యులు ఆరా తీయగా నదీమ్ పాషా, అజయ్‌దేవ్ తప్పుడు పత్రాలతో 9 చెట్లను తొలగించేందుకు అనుమతులుం పొంది 32 చెట్లను తొలగించినట్లు తేలింది. దీంతో అంతెం సంక్షేమ సంఘం సభ్యులు ట్విట్టర్ వేదికగా మంత్రి కేటీఆర్‌కు అనుమతులు లేకుండా హరిత హారం చెట్లను తొలగిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో స్పందించిన మంత్రి కేటీఆర్ అటవీ శాఖ అధికారులను విచారణ జరపాలని ఆదేశించారు. విచారణ చేపట్టిన అటవీ శాఖ అధికారులు తప్పుడు సమాచారంతో నదీమ్‌పాషా, అజయ్‌దేవ్‌లో చెట్ల తొలగింపునకు అనుమతులు పొందారని, అనుమతికి మించి చెట్లను తొలగించారని నిర్ధారించారు. ఈ మేరకు నిందితులకు రూ.20 వేల జరిమానా విధించారు. పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సాయిచంద్‌కు నివాళి

మేడ్చల్: తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ అకాల మరణంతో మేడ్చల్‌లో నాయకులు ఆయనకు నివాళులర్పించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, నాయకులు రాజమల్లారెడ్డి, నర్సింహరెడ్డి, భాగ్యారెడ్డి, జగన్‌రెడ్డి, వెంకటేశం, శేఖర్‌గౌడ్, కాడే మహేష్, సుధాకర్‌రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కీసరలోని పలు ప్రాంతాల్లో..

కీసర: సాయిచంద్ మృతికి సంతాపంగా గురువారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు రాంపల్లి, కీసర చౌరస్తాలో బీఆర్‌ఎస్ నేతలు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్లు చంద్రారెడ్డి, ప్రణీతా, సర్పంచులు మాధురివెంకటేష్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుజాత, నేతలు తదితరులు పాల్గొన్నారు.





మేడ్చల్‌లో సాయిచంద్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బోడుప్పల్: ప్రధాన మంత్రి మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం బోడుప్పల్ నార్త్ అశోక్‌నగర్‌లో నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమన్నారు. కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సీనియర్ సిటిజన్స్‌కు కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాసాల నర్సింగ్‌రావు, బోడుప్పల్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రతినిధులు ఏనుగుల లక్ష్మయ్య, కరుణాకర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మల్లాపూర్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీలోని 'స్పోర్ట్స్ ఎరినా బాక్స్ క్రికెట్' అకాడమీని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రికెట్ అకాడమీలతో యువకుల్లో ఐక్యతాభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు యాసిన్, హరీష్, ప్రతాప్, కార్తీక్, స్థానిక నేతలు పీఆర్.ప్రవీణ్, దయాకర్ రెడ్డి, గణేష్, కటర్ల శేఖర్‌బాబు, భానుచంద్రరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు వేయాలని వినతి

హబ్సిగూడ: ఏఎస్‌రావునగర్ డివిజన్ శ్రీనివాసనగర్ హౌసింగ్ కాలనీలో సీసీ రోడ్డు వేయాలని, కాలనీలో పురాతన పైపులైన్లు మార్చాలని, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు గురువారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, మోహన్, సాంబయ్య, ఉపేంద్రచారి, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ఓంప్రకాష్, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



జవహర్‌నగర్ ఈద్గాలో..

త్యాగానికి ప్రతీకైన బక్రీద్‌ను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం మజీద్‌లు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గొర్రెలు, మేకలు కోసి పేదలకు పంచారు. ముస్లింలు తమ బంధువులకు స్తోమతను బట్టి దానాలు చేశారు. గ్రామాల్లో కులమతాలకు అతీతంగా పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



జవహర్‌నగర్‌లో సీఐ సీతారాం, ఎస్‌ఐ అనిల్‌కుమార్‌ను సత్కరిస్తూ..



నాగారంలోని ఈద్గాలో..



నూతన్‌కల్‌లో..



మేడ్చల్ మసీదులో..



అన్నోజిగూడలో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న వైస్ చైర్మన్ రెడ్యానాయక్



ఘట్‌కేసర్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు



ఘట్‌కేసర్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్

జిల్లా అభివృద్ధికి మరోసారి పోరాటాలు చేస్తాం



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

మేడ్చల్: జిల్లాను అభివృద్ధి చేయడంలో మంత్రి మల్లారెడ్డి, ఎంపీ రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని, జిల్లాలో వసతుల కల్పనకు మరోసారి పోరాటాలు చేస్తామని మేడ్చల్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా సాధన సమితి దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మేడ్చల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రీనివాస కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా సాధన కోసం ఎన్నో పోరాటాలు చేసి సాధించామన్నారు. పోరాట స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మేడ్చల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు, ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడంలో మంత్రి మల్లారెడ్డి, ఎంపీ రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. మేడ్చల్ అభివృద్ధికి సాధన సమితి పోరాటాలకు సిద్ధమన్నారు. సమావేశంలో సమితి నాయకులు శ్రీనివాస్‌గుప్తా, దేవరాజ్‌గౌడ్, కిషన్‌రావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికే పెద్దపీట



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: మేడ్చల్ పట్టణ సమగ్ర అభివృద్ధికి తాము పెద్దపీట వేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికనర్సింహరెడ్డి అన్నారు. పట్టణంలోని 9వ వార్డు గిర్మాపూర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. అన్ని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. వార్డులవారిగా ఉన్న సమస్యలన్నీ గుర్తించి పరిష్కారం చూపుతున్నామని అన్నారు. గిర్మాపూర్ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లావణ్య హన్మంత్‌రెడ్డి, నాయకులు నర్సింహ, రాజిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో నిఘా నేత్రం కీలకం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ జానకి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్

మల్లాపూర్: నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని మల్కాజిగిరి డీసీపీ జానకి అన్నారు. గురువారం నాచారం డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయిబాబా దేవాలయంలో ఏర్పాటు చేసిన 23 సీసీ కెమెరాలను జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి డీసీపీ జానకీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమన్నారు. ముఖ్యమైన కేసుల్లో నిఘా నేత్రాలు నేర పరిశోధనలో కీలకంగా మారుతూ నిందితులను పట్టిస్తున్నాయని తెలిపారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా అందరికీ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మల్కాజగిరి ఏసీపీ పి.నరేశ్‌రెడ్డి, నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి, కోశాధికారి సత్యనారయణ, సలహాదారులు నర్సింహా, దామోదర్‌రెడ్డి, హరికృష్ణ, బీఆర్‌ఎస్ నేతలు విఠల్ యాదవ్, బుచ్చన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.